క్లుప్తంగా

వైభవంగా లక్ష్మీనృసింహుని కల్యాణం



అంతర్వేదిలో స్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో ఆదివారం ఆర్జిత సేవగా స్వామివారి శాంతి కల్యాణం బహుళ ద్వాదశి తిథి నాడు అర్చకులు ఘనంగా నిర్వహించారు. తొలుత ఆలయంలోని కల్యాణ మండపంలో ప్రత్యేక వేదికపై ఉత్సవమూర్తులను కొలువుదీర్చారు. అనంతరం స్వామివారి శాంతి కల్యాణం విష్వక్సేన పూజతో అర్చకులు ప్రారంభించారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ ఆధ్వర్యాన స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, అర్చకుడు పి.రామ శేషాచార్యులు ఈ కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో భక్తులకు దేవస్థానం స్వామి మూలవిరాట్టు దర్శనం కల్పించారు. వారికి ప్రసాద వితరణ, భోజన సౌకర్యం కల్పించారు.

సీసీ కెమెరాలతో పటిష్ట నిఘా

అంబాజీపేట: ప్రజల భద్రత, నేరాల నియంత్రణ, నేరస్తుల కదలికపై నిఘా ఉంచేందుకు పోలీస్ శాఖ స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో సీసీ కెమెరాల ఏర్పాటును యుద్ధప్రాతిపదికన చేపట్టింది. స్థానిక వర్తక వ్యాపార సంస్థల సహకారంతో నాలుగు రోడ్ల సెంటర్, మాచవరం, జయంతినగర్, గంగలకుర్రు మలుపు వద్ద సుమారు 20 కెమెరాలను ఏర్పాటు చేసినట్లు పి.గన్నవరం సీఐ ఆర్.భీమరాజు, ఎస్సై కె.చిరంజీవి తెలిపారు. పోలీసుల దర్యాప్తులో సీసీ కెమెరాల పాత్ర కీలకంగా మారడంతో, వీటిని దాతల సహకారంతో ఏర్పాటు చేయించామన్నారు. జనం రద్దీ ఉండే ప్రాంతాల్లో మరింత గస్తీని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. సీసీ కెమెరాల భద్రతపై ప్రత్యేక నిఘా ఉంచుతామని, వాటిని ధ్వంసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

నిండు శోకంతో మూసే ఏ కాజిమ్ షహదత్



నగరంలో గుమ్మటం ఊరేగింపులో పాల్గొన్న ముస్లింలు

మామిడికుదురు: ముస్లిం మతస్తుల ఆరాధ్యమైన ఇమామ్ హజరత్ మూస-ఎ-కాజిమ్ షహదత్ కార్యక్రమాన్ని ఆదివారం నిండు శోకంతో నిర్వహించారు. నగరంలోని మంజిలే కర్బలాలో మజ్లిస్ జరిగింది. అనంతరం బార్గాహే ఫాతిమా పంజా నుంచి గుమ్మటం తీశారు. నౌహా ఆలపిస్తూ, మాతం చేస్తూ, గుమ్మటాన్ని నగరం పంజీషా వరకు ఊరేగించారు. సిరాజ్ హైదర్ మాజింద్రాణి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానికులతో పాటు, ఇతర ప్రాంతాల నుంచి విశేష సంఖ్యలో వచ్చిన ముస్లింలు పాల్గొన్నారు. స్థానిక భక్త బృందాలు భక్తులకు భోజన ఏర్పాట్లు చేశాయి.

పీఎంఎంఎస్‌వైతో మత్స్య రంగ అభివృద్ధి



పల్లిపాలెంలో మత్స్యకార సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

సఖినేటిపల్లి: మత్స్య రంగంలో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడానికి, చేపల ఉత్పత్తిని పెంచడానికి పీఎంఎంఎస్‌వై తోడ్పడుతుందని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. ఆదివారం పల్లిపాలెం ఫిషింగ్ హార్బర్‌లో ఈ పథకానికి సంబంధించి మత్స్యకారులకు అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఈ పథకం ద్వారా మత్స్య రంగంలో ఉద్యోగావకాశాలు పెరిగే అవకాశం ఉందన్నారు. చేపల ఉత్పత్తిని పెంచి, ఆహార భద్రతను పెంచడానికి దోహదపడుతుందన్నారు. ఈ పథకం పర్యావరణపరంగా, ఆరోగ్యకరంగా, ఆర్థికంగా లాభదాయకమైనదిగా నిలుస్తుందన్నారు. ఫిషరీస్ ఏడీ హర్షవర్ధన్, ఏపీ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ జి.పెదకాపు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

తీర్థం పనులపై సమీక్ష

అంతర్వేది తీర్థం పనులపై స్థానిక టూరిజం భవనంలో ఎమ్మెల్యే అధికారులతో సమీక్షించారు. ఎలక్ట్రికల్, ఆర్‌అండ్‌బీ శాఖల పనుల పురోగతిపై ఆరా తీశారు. ఉత్సవ సేవా కమిటీ చైర్మన్ దిరిశాల బాలాజీ, ఆలయ ఏసీ వి.సత్యనారాయణ పాల్గొన్నారు.

కోడి పందేలపై పోలీసుల దాడి

మలికిపురం: మండలంలోని కత్తిమండ గ్రామ శివారులో నిర్వహిస్తున్న కోడి పందేలపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. నలుగురిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.1,850 నగదు, రెండు కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై సురేష్ తెలిపారు.

మువ్వన్నెల రెపరెపలు

- ఘనంగా గణతంత్ర వేడుకలు
- ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో పతాకావిష్కరణలు



సఖినేటిపల్లిలో జెండా ఎగుర వేస్తున్న ఎంపీడీవో సూర్యనారాయణరావు

అలమూరు: భారత రాజ్యాంగ స్ఫూర్తి, పవిత్రత, ఆవశ్యకతను తెలియజేసేలా, దేశభక్తిని ప్రతిబింబించేలా వివిధ గ్రామాల్లో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, పాఠశాలల వద్ద ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు మువ్వన్నెల పతాకాన్ని ఆవిష్కరించి, గౌరవ వందనం చేశారు. ఆలమూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి, వైస్ ఎంపీపీ వాసంశెట్టి దుర్గాభవాని తదితరులు గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించారు. అనంతరం మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు ఘన నివాళులర్పించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ కేజే ప్రకాష్‌బాబు, డిప్యూటీ తహసీల్దార్ టి.సుబ్బరాజు, పోలీసు స్టేషన్ వద్ద ఎస్సై ఎం.అశోక్, పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీల్లో వైద్యాధికారులు డి.సాయికిషోర్, డి.సువర్చలాదేవి, ఆర్.మల్లికార్జున్, ఆలమూరు ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యాధికారి పి.గోపీరామ్, వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ కార్యాలయంలో ఏడీఏ కె.నాగేశ్వరరావు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్ కేవీఎస్ కుమారి, సబ్ ట్రెజరీ, వెలుగు, మండల విద్యా శాఖ కార్యాలయాల వద్ద అధికారులు పతాకావిష్కరణ చేశారు. మండలంలోని ఆయా పంచాయతీ కార్యాలయాల వద్ద సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రభుత్వ పాఠశాలల వద్ద ప్రధానోపాధ్యాయులు పతాకాన్ని ఆవిష్కరించి, విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు. ఆలమూరులోని ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో అధ్యాపకులు, విద్యార్థులు గణతంత్ర దినోత్సవ వేడుకలను నిర్వహించారు.

అంబాజీపేట: మండలంలో గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఎంపీడీఓ జీవీ సరోవర్, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, ఎంపీటీసీ మండల సమాఖ్య అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రశాంత్, స్థానిక తాజా ప్రెస్ క్లబ్ భవనం వద్ద అధ్యక్షుడు పళ్ల సూర్యప్రకాశరావు, మాచవరంలో సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, తహసీల్దార్ కార్యాలయం, జెడ్పీ హైస్కూలు, పోలీస్ స్టేషన్ వద్ద త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. పాఠశాలల వద్ద హెచ్‌ఎంలు జాతీయ జెండా ఎగురవేశారు. ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఉత్తమ సేవా పురస్కారాలు అందజేశారు.

మామిడికుదురు: రిపబ్లిక్ డే వేడుకలను పురస్కరించుకుని స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. మామిడికుదురు పంచాయతీ వద్ద సర్పంచ్ గౌస్‌మొహిద్దీన్, ఎంపీటీసీ నయినాల సీతా మహాలక్ష్మి, ఎంఈఓ కె.లక్ష్మీనారాయణ, పంచాయతీ కార్యదర్శి పీవీఆర్‌కే రాజు పాల్గొన్నారు. అప్పనపల్లి కంకిపాటి సూర్యారావు, ఆదిలక్ష్మి మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో స్మారక భవనంలో రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్, మహాత్మాగాంధీ చిత్రపటాలకు వ్యవస్థాపకుడు కంకిపాటి వెంకటేశ్వరరావు, స్థానికులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నగరం కాంగ్రెస్ కార్యాలయం వద్ద డీసీసీ అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు జాతీయ పతాకాన్ని ఎగుర వేశారు.

సఖినేటిపల్లి: గణతంత్ర దినోత్సవ వేడుకలు ఆదివారం ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఘనంగా జరిగాయి. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో కె.సూర్యనారాయణరావు జాతీయ పతాకాన్ని ఎగుర వేశారు. ఎంపీపీ వీరా మల్లిబాబు, ఎంపీటీసీలు మందపాటి రత్నం, చొప్పల బాబూరావు తదితరులు పాల్గొన్నారు. స్థానిక పోలీసు స్టేషన్, తహసీల్దారు కార్యాలయం వద్ద గణతంత్ర వేడుకలు జరిగాయి. సఖినేటిపల్లి పంచాయతీ వద్ద జరిగిన గణతంత్ర వేడుకల్లో సర్పంచ్ గొల్లమందల చిట్టిబాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. డాక్టర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం దేశ ప్రజలకు సమానత్వం అందించిందని బీజేపీ రాష్ట్ర డ్రెయినేజీ సెల్ కన్వీనర్ చెంపాటి శివరామకృష్ణంరాజు అన్నారు. స్థానిక పంచాయతీ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. కేశవదాసుపాలెం కాలువ మొగ సెంటర్లో రత్న మెమోరియల్ ఎస్సీ యూత్ ఆధ్వర్యంలో గణతంత్ర వేడుకలు జరిపి, జాతీయ నేతల విగ్రహాలకు నివాళులర్పించారు.



కొత్తపేటలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీకర్

రాజ్యాంగ స్ఫూర్తితో జాతి సమైక్యత

కొత్తపేట: డాక్టర్ అంబేడ్కర్ మేధాసంపత్తితో రూపొందిన భారత రాజ్యాంగం ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిచిందని, ఆ రాజ్యాంగ స్ఫూర్తితో జాతీయ సమైక్యతను చాటాలని ఆర్డీఓ పి.శ్రీకర్ అన్నారు. స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయం వద్ద గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహాత్మాగాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు ఆర్డీఓ ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. వాడపాలెం పంచాయతీ వద్ద మహాత్మాగాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు నివాళులర్పించి, జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. మండల రెవెన్యూ కార్యాలయం వద్ద తహసీల్దార్ వై రాంబాబు, మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీఓ పీఎస్ నరేష్‌కుమార్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఎంపీపీ మార్గన గంగాధరరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విద్యా శాఖ కార్యాలయం వద్ద ఎంఈఓ మట్టపర్తి హరిప్రసాద్, పోలీస్ స్టేషన్ వద్ద ఎస్సై జి.సురేంద్ర ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. వానపల్లి గాంధీనగర్‌లో బీజేపీ నేత పాలూరి సత్యానందం అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, పాఠశాలలు, పంచాయతీల వద్ద జాతీయ పతాకాలను ఎగురవేశారు. స్థానిక విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు జాతీయ పతాకావిష్కరణ చేశారు.

మలికిపురం: బీజేపీ మండల అధ్యక్షుడు మేడిచర్ల చాణక్య ఆధ్వర్యంలో మలికిపురంలో గణతంత్ర వేడుకలు జరిగాయి. రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీ వేమా, జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు.

అయినవిల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, పోలీస్టేషన్లలో ఎంపీడీఓ జి.భీమారావు, తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మ, హెచ్‌సీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో గణతంత్ర వేడుకలు జరిగాయి. ఎస్ఎస్‌వీఆర్ జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల, ముక్తేశ్వరం కోనసీమ విద్యాశ్రమం తదితర వాటిలో జాతీయ జెండాను ఎగురవేశారు. ఎంపీపీ మట్టపర్తి నాగవిజయలక్ష్మి, జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ అడపా నాగభూషణం, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు. ముక్తేశ్వరం సెంటర్‌లో మాలమహానాడు మండల అధ్యక్షుడు గిడ్ల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి.

రాజోలు: గణతంత్ర వేడుకల సందర్భంగా రాజోలు కోర్టు కాంప్లెక్స్‌లో సీనియర్ సివిల్ జడ్జి ప్రమీలారాణి జాతీయజెండాను ఆవిష్కరించారు. బార్ అసోసియేషన్ కార్యాలయం వద్ద అధ్యక్షుడు మామిడిశెట్టి సాయిబాబు జాతీయ జెండాను ఎగురవేశారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎన్ఎస్ఎస్ ప్రసాద్, సర్కిల్ కార్యాలయంలో సీఐ నరేష్‌కుమార్, మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీఓ డి.రాంబాబు, రాజోలు శాఖా గ్రంథాలయం వద్ద సర్పంచ్ రేవు జ్యోతి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఎంపీపీ కేతా శ్రీనివాస్, ఎంఈఓ నల్లి మనోహరం, ఏఓ ఎం.సత్యనారాయణ, న్యాయవాది యాలంగి రమేష్ పాల్గొన్నారు.

పి.గన్నవరం: దేశాభివృద్ధికి అందరూ పాటుబడాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. శింగంశెట్టి ప్రభావతి జెడ్పీ హైస్కూల్ వద్ద ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, ఎంపీడీఓ కేవీ ప్రసాద్, సర్పంచ్ బొండాడ నాగమణి, హెచ్‌ఎం డీఎస్‌వీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. పి.గన్నవరం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పాబోలు కృష్ణమూర్తి, వాసవీ క్లబ్ అధ్యక్షుడు ఎస్‌వీ లక్ష్మీపతి ఆధ్వర్యంలో స్థానిక అక్విడెక్టు పార్కులో జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. మూడు రోడ్ల సెంటర్లో బస్టాండ్ వద్ద సిమ్మెంటు బెంచీని ఏర్పాటు చేశారు.



రాజోలు కోర్టు కాంప్లెక్స్ వద్ద జాతీయ జెండా ఎగుర వేస్తున్న సీనియర్ సివిల్ జడ్జి ప్రమీలారాణి



పెదపళ్ల పీహెచ్‌సీ వద్ద జాతీయ పతాకానికి గౌరవ వందనం చేస్తున్న వైద్యారోగ్య సిబ్బంది



అంబాజీపేటలో సేవా పురస్కారాన్ని అందిస్తున్న ఎంపీపీ వెంకటేశ్వరరావు



అప్పనపల్లిలో అంబేడ్కర్ విగ్రహానికి స్థానికుల నివాళి

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి



పార్టీ నాయకులతో మాట్లాడుతున్న చెల్లుబోయిన శ్రీనివాసరావు

పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన

అయినవిల్లి: వైఎస్సార్ సీపీ బలోపేతానికి గ్రామ స్థాయి నుంచి అభిమానులను, కార్యకర్తలను, నాయకులను కలుపుకొని పనిచేస్తున్నట్లు పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం ఆయన పార్టీ మండల అధ్యక్షుడు కుడుపూడి విద్యాసాగర్ ఇంటి వద్ద పార్టీ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చెల్లుబోయిన మాట్లాడుతూ, పార్టీ పి.గన్నవరం నియోజకవర్గ కో-ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులతో కలసి, పార్టీ పూర్వవైభవానికి కృషి చేస్తున్నారన్నారు. పార్టీపై ప్రజల్లో ఉన్న అభిమానాన్ని దెబ్బతీసేందుకు కూటమి నాయకులు సోషల్ మీడియా వేదికగా అసత్య ప్రచారం చేస్తున్నారన్నారు. వీటిని ఎవరూ నమ్మే పరిస్థితుల్లో లేరని తెలిపారు. కార్యక్రమంలో నేదునూరు సర్పంచ్ గుమ్మడి ప్రసాద్, పార్టీ నాయకులు బొంతు శ్రీను, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఇంజినీర్ల క్రీడా సంబరాలు ప్రారంభం

అయినవిల్లి: గ్రామ సచివాలయ ఇంజినీర్ల సంఘం ఆధ్వర్యంలో డ్రీమ్-2కే25 క్రీడా సంబరాలను జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి పి.కృష్ణారెడ్డి ముక్తేశ్వరం జెడ్పీ హైస్కూల్‌లో ఆదివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, క్రీడలతో ఉద్యోగులకు మానసికోల్లాసం కలుగుతుందన్నారు. ఉద్యోగుల మధ్య సాన్నిహిత్యం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ డీఈఈ అన్యం రాంబాబు, అమలాపురం పీఆర్ డీఈఈ పీఎస్ రాజ్‌కుమార్, సంఘ ప్రతినిధులు కాలే సురేష్, గోవింద్‌బాబు, షాలేంరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మిరియాలకు పద్మశ్రీ కోనసీమకే గర్వకారణం

మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి



పద్మశ్రీ అప్పారావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి తదితరులు

రావులపాలెం: కేంద్ర ప్రభుత్వ పద్మశ్రీ అవార్డు రావులపాలేనికి చెందిన మిరియాల అప్పారావును వరించడం కోనసీమ ప్రజలకు గర్వకారణమని మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. రావులపాలెంలోని మిరియాల అప్పారావు ఇంటి వద్ద ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి జగ్గిరెడ్డి పూలమాల వేసి, స్థానిక నాయకులతో కలసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ, పురస్కారం వరించేటప్పటికీ ఆయన భౌతికంగా మన మధ్య లేకపోవడం విచారకరమన్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నామన్నారు. గతంలో వైఎస్సార్ సీపీ అధికారంలో ఉండగా, అప్పారావుకు వైఎస్సార్ అచీవ్‌మెంట్ అవార్డు ఇచ్చి, వైఎస్సార్ కాంస్య విగ్రహమిచ్చి ఆయనను మొట్టమొదటిగా గుర్తించినట్లు వివరించారు. ఆయన కుటుంబానికి ఎల్లప్పుడూ చేదోడుగా ఉంటామన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కాగా మిరియం అప్పారావుకు పద్మశ్రీ రావడం గర్వకారణంగా ఉందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. స్థానిక అప్పారావు ఇంటి వద్ద ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు.

మంద కృష్ణకు పురస్కారంపై హర్షం

అయినవిల్లి: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఉద్యమ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగకు పద్మశ్రీ అవార్డు రావడంపై అంబాజీపేట మార్కెటింగ్ కమిటీ మాజీ డైరెక్టర్ చేట్ల రామారావు హర్షం వెలిబుచ్చారు. దేశం గర్వించదగ్గ గొప్ప ప్రజా ఉద్యమ నేత అని కొనియాడారు.

మాజీ మంత్రి గొల్లపల్లి పరామర్శ

మామిడికుదురు: మగటపల్లి గ్రామంలో ఇటీవల మృతి చెందిన ఉండ్రు లక్ష్మీకాంతం, బొడ్డపల్లి రామలక్ష్మి, భూపతి సోమేశ్వరరావు కుటుంబ సభ్యులను మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు ఆదివారం పరామర్శించారు. వారి చిత్రపటాల వద్ద పుష్పాలుంచి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బొలిశెట్టి భగవాన్, జిల్లా యువజన విభాగం అధ్యక్షులు సూరిశెట్టి బాబి, బండారు పండు, ఇందుర్తి వెంకటేశ్వరరావు, బొంతు సత్యనారాయణ, బొంతు శివ, వర్ధనపు బుజ్జి, బంగారినాయుడు ఉన్నారు.



లక్ష్మీకాంతం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గొల్లపల్లి తదితరులు

గీత కులాలకు ‘కూటమి’ మోసం



పాటి శివకుమార్

సఖినేటిపల్లి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం బ్రాందీ షాపుల్లో గీత కులాలకు పది శాతం రిజర్వేషన్ కింద 340 దుకాణాలను కేటాయిస్తున్నట్టు చెప్పి, మోసం చేసిందని రామేశ్వరానికి చెందిన ఏపీ నెడ్ క్యాప్ మాజీ డైరెక్టర్ పాటి శివకుమార్ అన్నారు. ఆదివారం ఇక్కడ ఆయన మీడియాతో మాట్లాడారు. శెట్టిబలిజ, గౌడ, ఈడిగ, శ్రీసైన, యాత, గీత కులాలకు తీవ్ర అన్యాయం జరిగిందని ధ్వజమెత్తారు. బ్రాందీ షాపులపై పది శాతమిస్తే, కనీసం నియోజకవర్గానికి ఒకటి నుంచి రెండు షాపులైనా కేటాయించాల్సి ఉందన్నారు. గీత కులాలు తక్కువ ఉన్న చోట్ల ఎక్కువ షాపులిచ్చి, ఎక్కువున్న చోట్ల కనీసం ఒక్క షాపు కూడా కేటాయించని పరిస్థితి వచ్చిందన్నారు. అంతేగాకుండా గీత కులాలకు కేటాయించే 340 షాపులకూ రూ.2 లక్షల ఫీజు పెట్టడం దారుణమన్నారు. ఇప్పుడిచ్చిన జీవో రద్దు చేసి, ఆయా కులాలకు జనాభా ప్రాతిపదికన దుకాణాలను కేటాయించాలని డిమాండ్ చేశారు. ఫీజు రూ.25 వేలకు తగ్గించాలన్నారు.

పురాణ, ఇతిహాసాల్ని తెలుసుకోవాలి

ఆలమూరు: వేద, పురాణ, ఇతిహాసాలను ప్రతి ఒక్కరూ తెలుసుకుని భక్తిభావాన్ని పెంపొందించుకోవాలని ప్రముఖ ప్రవచన కర్త ఓలేటి రవి కుమారాచార్య స్వామి అన్నారు. చింతలూరులోని శ్రీదేవీ, భూదేవీ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం రాత్రి వేంకటాచల మహత్యం, బ్రహ్మోత్సవ వైభవం అనే అంశాలపై ఆయన ప్రసంగించారు. పురాణాలు, ఇతిహాసాల్లోని గొప్పదనాన్ని చక్కగా వివరించారు.

బాధితుడికి ఆర్థిక సాయం

రావులపాలెం: అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తి చికిత్స కోసం స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు ఆదివారం రూ.16 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. స్థానికంగా హోటల్‌లో వంట మాస్టర్‌గా పని చేస్తున్న నంద్యాల జిల్లా కేంద్రంలోని టెక్కే గ్రామానికి చెందిన 21 ఏళ్ల బైలుపాటి పుల్లయ్య మూడు నెలల క్రితం క్యాన్సర్ బారిన పడ్డాడు. సంస్థ సభ్యులు రావులపాడులో పుల్లయ్య ఇంటికి వెళ్లి ఈ చెక్కును అందజేశారు.

ఉత్తమ సేవకులకు పురస్కారాలు



కలెక్టర్ మహేష్‌కుమార్ నుంచి అవార్డు అందుకుంటున్న ఆశా కార్యకర్త విమలకుమారి, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ సూర్యనారాయణ రాజు, డిప్యూటీ తహసీల్దార్ భాస్కర్, సీనియర్ అసిస్టెంట్ రామరాజు, కానిస్టేబుల్ బాబ్జీ, ఏపీఈపీడీసీఎల్ అసిస్టెంట్ ఇంజినీర్ మోహన్, కానిస్టేబుల్ నరేష్, సమగ్రశిక్షా ఏఈ నాగేశ్వరరావు, పి.గన్నవరం కానిస్టేబుల్ ఐవీ ప్రసాద్, వీఆర్‌ఓ సంతోషివాణి, హెచ్‌ఎం కృష్ణారెడ్డి, ఎస్సై సురేంద్ర



ఉత్తమ సేవా పురస్కారం అందుకుంటున్న ఆలమూరు లైన్‌మన్ సురేష్, అసిస్టెంట్ లైన్‌మన్ జానకిరామయ్య

అంబాజీపేట: గణతంత్ర దినోత్సవం సందర్భంగా అమలాపురంలో జరిగిన వేడుకల్లో కలెక్టర్ రావిరాల మహేష్‌కుమార్ చేతుల మీదుగా పలువురు అధికారులు, ఉగ్యోగులు ఉత్తమ సేవా పురస్కారాలు అందుకున్నారు. అంబాజీపేటకు చెందిన ఏపీఈపీడీసీఎల్ అసిస్టెంట్ ఇంజినీర్ కాకర మోహన్, పీహెచ్‌సీ ఎంపీహెచ్‌ఏ జీవీఎస్ఆర్ ప్రసాద్, పోలీస్ కానిస్టేబుల్ కె.నరేష్, కోకోఫెడ్ చైర్మన్ అరిగెల బలరామమూర్తి అవార్డులు అందుకున్నారు.

సఖినేటిపల్లి: డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ భాస్కర్ బెస్ట్ సర్వీస్ అవార్డు అందుకున్నారు. అలాగే తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ వీవీ రామరాజు, సఖినేటిపల్లి పీహెచ్‌సీ పరిధిలోని అంతర్వేదిపాలెం-2 సచివాలయ ఆశా కార్యకర్త బి.విమలకుమారి, ఎడ్యుకేషన్ విభాగంలో జీవీ వుంత జెడ్పీ ఉన్నత పాఠశాల ఉద్యోగి బి.కిషోర్, పోలీసు స్టేషన్ కానిస్టేబుల్ బొమ్మిడి బాబ్జీ అవార్డులందుకున్నారు.

మలికిపురం: మండలంలోని లక్కవరం వెటర్నరీ డిస్పెన్సరీలో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ పి.సూర్యనారాయణ రాజు బెస్ట్ సర్వీస్ అవార్డు అందుకున్నారు. కలెక్టర్ మహేష్‌కుమార్ ఆయనకు అవార్డు అందించారు.

ఆలమూరు: ఏపీఈపీడీసీఎల్ ఆలమూరు లైన్‌మన్ గొడవర్తి సురేష్‌కు ఉత్తమ సేవా పురస్కారం లభించింది. గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని అమలాపురం ఎస్ఈ కార్యాలయంలో ఎస్ఈ ఎస్.రాజబాబు ఆయనకు అవార్డు అందజేశారు. ప్రస్తుతం సురేష్ కపిలేశ్వరపురంలో పనిచేస్తున్నారు.

పి.గన్నవరం: ఉత్తమ సేవలు అందించిన సమగ్రశిక్షా ఏఈ వార నాగేశ్వరరావు, పి.గన్నవరం పోలీస్ కానిస్టేబుల్ ఐవీ ప్రసాద్ కలెక్టర్ నుంచి పురస్కారాలు అందుకున్నారు. పి.గన్నవరం అసిస్టెంట్ లైన్‌మన్ తాటికాయల జానకిరామయ్య ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ ఎస్.రాజబాబు నుంచి ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు.

రావులపాలెం: ఊబలంక సచివాలయం-2 వీఆర్వో జి.సంతోషివాణి, ఈతకోట హైస్కూల్ హెచ్‌ఎం కేఎస్‌వీ కృష్ణారెడ్డి అవార్డులందుకున్నారు. అమలాపురంలో కలెక్టర్, ఎంపీ నుంచి అవార్డులు స్వీకరించారు.

కొత్తపేట: గణతంత్ర వేడుకల సందర్భంగా ఎస్సై జి.సురేంద్ర కలెక్టర్ మహేష్‌కుమార్, ఎస్పీ కృష్ణారావు నుంచి పురస్కారం అందుకున్నారు. గతేడాది చివరి మూడు నెలల్లో 150 పెండింగ్ కేసులను ఈయన పరిష్కరించారు.

అయినవిల్లి: పి.గన్నవరం నియోజకవర్గ సమగ్రశిక్షా ఏఈ వార నాగేశ్వరరావుకు, శానపల్లిలంక వీఆర్‌ఏ శ్రీను, తహసీల్దార్ కార్యాలయ టైపిస్టు కె.నరసింహమూర్తికి కలెక్టర్ ప్రశంసాపత్రాలు అందజేశారు.